ప్రజాశక్తి
బుధవారం 6 డిసెంబరు 2023
5
శ్రీకాకుళం



నేటి నుంచి కోర్టుల బహిష్కరణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఎపి టైట్లింగ్ యాక్ట్-23లో రాష్ట్ర ప్రభుత్వం పొందుపర్చిన సెక్షన్లు, మరికొన్ని అంశాలను వ్యతిరేకిస్తూ ఈనెల 6 నుంచి 8వ తేదీ వరకు న్యాయవాదులు కోర్టులను బహిష్కరించాలని బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎన్ని సూర్యారావు పిలుపునిచ్చారు. ఈ చట్టం ప్రకారం సివిల్ కోర్టుల పరిధి నుంచి తప్పించి ప్రభుత్వం ఒక ప్రత్యేక అధికారిని నియమిస్తుందన్నారు. ఆ అధికారి ఇచ్చే తీర్పుపై స్థానిక సివిల్ కోర్టులకు కాకుండా హైకోర్టుకు మాత్రమే అధికారం ఉంటుందన్నారు. దీనివల్ల 90 వేల మంది న్యాయవాదుల భవిష్యత్ ప్రశ్నార్థకమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆ చట్టాన్ని పూర్తిగా నిషేధించాలని డిమాండ్ చేస్తూ కోర్టులను బహిష్కరిస్తున్నట్లు తెలిపారు.

తప్పిన ముప్పు

- తీరం దాటిన 'మిచౌంగ్'
- జిల్లాలో పలుచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు
- ఊపిరిపీల్చుకున్న అధికారులు
- అల్లకల్లోలంగా మారిన సముద్రం
- రోజంతా చలిగాలులు



ఎచ్చెర్ల : బుడగట్లపాలెం సముద్రతీరాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి


బంగాళాఖాతంలో ఏర్పడిన మిచౌంగ్ తుపాను ముప్పు జిల్లాకు తప్పింది. మంగళవారం మధ్యాహ్నం నాలుగు గంటల సమయంలో బాపట్ల సమీపంలో తుపాను తీరాన్ని దాటింది. తుపాను గండం నుంచి గట్టెక్కడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. తుపాను ప్రభావంతో జిల్లాలో పలుచోట్ల ఉదయం మోస్తరు వర్షాలు కురవగా, రాత్రి పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిశాయి. బుధవారం కూడా జిల్లాలో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. సంతబొమ్మాళిలో అత్యధికంగా 5.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. పాతపట్నం మండలంలో 5.25 మి.మీ, కవిటి మండలం రాజపురం, రణస్థలం మండలం పైడిభీమవరంలో 3.75 మి.మీ వర్షం పడింది. మిచౌంగ్ ప్రభావంతో రోజంతా చలిగాలులు వీచాయి. సముద్రం అల్లకల్లోలంగా మారింది.

తుపాను ప్రభావంతో సోమవారం రాత్రి నుంచి జిల్లాలో పలుచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. దీంతో రైతులు మరింత కలవరపాటుకు గురయ్యారు. మంగళవారం వర్షం ప్రభావం పెద్దగా లేకపోవడంతో రైతాంగం ఊపిరి పీల్చుకుంది. వర్షాలు పడుతుండడంతో రైతులు కోసిన ధాన్యాన్ని సమీప మిల్లులకు తరలించారు. కొన్నిచోట్ల కోసిన వరి ఓవులు తీసుకువెళ్లే అవకాశం లేకపోవడంతో పొలంలోనే విడిచిపెట్టేశారు. అయితే వర్షాలు పెద్దగా కురవకపోవడంతో నష్టం కలగలేదు. తుపాను ప్రభావంతో రోజంతా చలిగాలులు వీచాయి. గాలుల తీవ్రత పెద్దగా లేకపోవడంతో పైరు ప్రమాదం తప్పింది.

మిచౌంగ్ ప్రభావంతో వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ అధికారుల హెచ్చరికలతో కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అధికారులతో ఎప్పటికప్పుడు మాట్లాడుతూ పరిస్థితిని తెలుసుకున్నారు. ఎచ్చెర్ల మండలం బుడగట్లపాలెం సముద్రతీర ప్రాంతాన్ని సందర్శించి మత్స్యకారులతో మాట్లాడారు. తుపాను ప్రభావం తగ్గే వరకు చేపల వేటకు వెళ్లొద్దని సూచించారు. బోట్లను సురక్షిత ప్రాంతంలో ఉంచాలని చెప్పారు. తుపాను నేపథ్యంలో నాలుగు రోజులుగా చేపల వేటకు వెళ్లకపోవడంతో ఉపాధి కోల్పోయాయని, పరిహారం ఇచ్చి ఆదుకోవాలని కలెక్టర్‌ని కోరారు. పరిహారం తమ పరిధిలో లేదని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. పలాస ఆర్‌డిఒ భరత్ నాయక్ వజ్రపుకొత్తూరు మండలం మంచినీళ్లపేటను సందర్శించారు. మిచౌంగ్ తుపాన్ ప్రభావం కోస్తా తీరంలో అధికంగా ఉంటుందని వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో జాగ్రత్తలు పాటించాలని అన్నారు. భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున లోతట్టు



వజ్రపుకొత్తూరు : తీర ప్రాంతంలో పర్యటిస్తున్న ఆర్‌డిఒ భరత్ నాయక్



నందిగాం : కోటిపల్లిలో పొలంలో తడిచిన వరి ఓవులు

ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయాలని తహాశీల్దార్ బి.అప్పలస్వామికి సూచించారు. భారీ వర్షాలకు ఉప్పుటేరులోకి వరదనీరు పోటెత్తితే పూడిలంకకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోతాయని, వారి కోసం పలు సూచనలు చేసినట్లు తహాశీల్దార్ బదులిచ్చారు. వైస్ ఎంపిపి వంక రాజు, సర్పంచ్ వంక సత్యరాజ్, సర్వేయరు తిరుపతిరావు, విఆర్ఒ రంగారావు తదితరులు ఉన్నారు.



చేప చిక్కినా.. సొమ్ము దక్కదు

- మత్స్యకారులకు తప్పని తిప్పలు
- కోల్డ్ స్టోరేజీలు, జెట్టీలు లేక అవస్థలు

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో ఎక్కువ మంది మత్స్యకారులు సముద్రంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. సుదీర్ఘ తీర ప్రాంతం ఉన్న జిల్లాలో చేపల వేట రోజురోజుకూ తగ్గుముఖం పడుతోంది. సౌకర్యాల్లేక, ప్రభుత్వాల నుంచి తోడ్పాటు అందక ఇతర ప్రాంతాలకు వలస వెళ్లి జీవనం సాగించాల్సిన దయనీయ పరిస్థితి. జిల్లాకు చెందిన సీదిరి అప్పలరాజు మత్స్యశాఖ మంత్రిగా ప్రాతినిధ్యం వహిస్తున్నా, మత్స్యకారుల కష్టాలు మాత్రం తీరడం లేదు. జెట్టీలు, హార్బర్లు నిర్మిస్తామని పాలకులు చెప్పడమే తప్ప నేటికీ కార్యరూపం దాల్చకపోవడంతో వలస జీవనం తప్పడం లేదు.

జిల్లాలో 11 తీర ప్రాంత మండలాల్లో మత్స్యకారులు జీవనం సాగిస్తున్నారు. 193 కిలోమీటర్ల పొడవున జిల్లాలో విస్తరించి ఉన్న తీరంలో వేలాది కుటుంబాలు చేపల వేటే జీవనాధారంగా ఉన్నాయి. సముద్రంలో వేట సాగించడం, దొరికిన చేపలను ఒడ్డుకు చేర్చి వాటిని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోకి తరలించి విక్రయించడం రోజువారీ జీవన విధానంగా మారింది. చేతికి అందిన చేపలను నిల్వ చేసుకునే సామర్థ్యం గల కోల్డ్ స్టోరేజీ సౌకర్యం జిల్లాలో లేకపోవడంతో ఏరోజుకారోజు చేపలు అమ్మాల్సిన దుస్థితి ఉంది. ఇతర ప్రాంతాలనుంచి వ్యాపారులు వచ్చినా చేసేది లేక తక్కువ ధరకే అమ్ముకోవాల్సి వస్తోందని మత్స్యకారులు వాపోతున్నారు.

జిల్లాలో గతంలో భావనపాడు వద్ద ఫిషింగ్ హార్బర్ నిర్మాణం జరిగినా అది వినియోగంలోకి రాలేదు. తరచూ ఇసుక మేటల వల్ల దీన్ని వృథాగానే వదిలేశారు. ఇది తప్ప మరెక్కడా ఒక్క నిర్మాణం జరగలేదు. వజ్రపుకొత్తూరు మండలం నువ్వలరేవు, ఎచ్చెర్ల మండలం కుప్పిలి ప్రాంతాల్లో జెట్టీలను నిర్మిస్తామన్న ప్రభుత్వాలు నేటికి వాటిని చేపట్టలేదు. మరోవైపు తీరంలో కోల్డ్ స్టోరేజీలు, ఫ్లాట్‌ఫారాల్లేక దొరికిన చేపలను ఎప్పటికప్పుడు మార్కెట్‌కు తరలించాల్సి వస్తోంది. దీనవల్ల సరైన ధర లేక రాత్రింబవళ్లు శ్రమిస్తున్నా ఫలితం దక్కడం లేదు. దీనికితోడు విపత్తుల సమయంలో స్థానికులకు రక్షణగా నిలిచే భవనాలు చాలాచోట్ల శిథిలావస్థకు చేరుకున్నాయి. ఒకట్రెండు తప్ప మిగిలినవన్నీ కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. కొత్త భవనాలు నిర్మిస్తామని, ఆందోళన వద్దని ప్రభుత్వం హామీ ఇచ్చినా, నీటిమూటగానే మిగిలిపోయింది. దీంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని అంతా భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. చేపలు సమృద్ధిగా చిక్కుతున్నా మార్కెటింగ్ సదుపాయం వేధిస్తోంది. స్థానికంగానూ క్రయవిక్రయాలకు ఎలాంటి వసతుల్లేవు. దూర ప్రాంతాలకు తరలించేందుకు రవాణా సదుపాయమూ కొరవడుతోంది. జిల్లాలో ఏటా 1.78లక్షల మెట్రిక్ టన్నుల చేపలు ఇతర ప్రాంతాలకు ఎగుమతి అవుతున్నాయి. వేలాదిగా ఉన్న మత్స్యకార కుటుంబాల్లో వందల మందికి మాత్రమే లబ్ధి చేకూరుతోంది. వనరులు లేకపోవడం, ఆదాయ మార్గాలు సన్నగిల్లడంతో ఈ పరిస్థితి కనిపిస్తోంది. ఏటా 15 వేల మంది వరకు గుజరాత్, ఒడిశా, చెన్నై తదితర ప్రాంతాలకు పయనమవుతున్నారు. వలసల నివారణకు మాత్రం చర్యలు కనిపించడం లేదు.

మత్స్యకారుల అభివృద్ధికి చర్యలు

మత్స్యకారుల అభివృద్ధిపై దృష్టిసారించాం. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నాం. అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక కార్యాచరణ రూపొందించాం. జెట్టీ ఏర్పాటుకు అనువైన స్థలాన్ని ఎంపిక చేయడమైంది. త్వరలోనే పనులు ప్రారంభమవుతాయి.

- శ్రీనివాసరావు, డీడీ, మత్స్య శాఖ

దళారులను నమ్మొద్దు

- ప్రతి గింజా ప్రభుత్వం కొంటుంది
- శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న స్పీకర్ సీతారాం

ప్రజాశక్తి - బూర్జ

రైతులు పండించిన ప్రతి గింజనూ ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని... రైతులు మధ్యవర్తులు, దళారులను నమ్మొద్దని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. బూర్జ ప్రాథమిక సహకార పరపతి సంఘం ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఎలాంటి అన్యాయం జరగకుండా చూసేందుకు రాష్ట్ర ప్రభుత్వం రైతుభరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేసే ప్రక్రియకు శ్రీకారం చుట్టిందన్నారు. ఈ-క్రాప్ చేసుకున్న ప్రతి రైతు పండించిన పంటను కొనుగోలు చేస్తుందని చెప్పారు. దళారులు, మధ్యవర్తులు, మిల్లర్ల చేతిలో రైతులు నష్టపోకుండా గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నేరుగా విక్రయించాలన్నారు. రైతులు పండించిన పంటను కనీస మద్దతు ధరకు ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని స్పష్టం చేశారు.

ఇంటింటికీ స్వచ్ఛమైన తాగునీరు

రక్షిత మంచి నీటి పథకం ద్వారా ఇంటింటికీ స్వచ్ఛమైన తాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పీకర్ సీతారాం అన్నారు. మండలంలోని అన్నంపేటలో రూ.25 లక్షల అంచనాలతో నిర్మించ తలపెట్టిన రక్షిత మంచినీటి పథకానికి శంకుస్థాపన చేశారు. రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ నూతన భవన సముదాయాన్ని ప్రారంభించారు. రూ.తొమ్మిది లక్షలతో జగనన్న కాలనీలో ఐదుగురు లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు చేశారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ నియోజకవర్గంలో అన్ని గ్రామాలను అభివృద్ధి చేస్తామన్నారు. మండలంలోని ప్రతి గ్రామానికి మౌలిక సదుపాయాల కల్పనకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నట్లు చెప్పారు. వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టినట్లు వివరించారు. గ్రామాల్లో ఏర్పాటు చేసిన వెల్‌నెస్ సెంటర్ల ద్వారా ప్రాథమిక వైద్యం ప్రజలకు అందుబాటులో లభిస్తుందన్నారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి బి.రామారావు, ఎంపిపి ప్రతినిధి కె.నాగేశ్వరరావు, వైస్ ఎంపిపి బుడుమూరు సూర్యారావు, వైసిపి మండల అధ్యక్షులు కె.గోవిందరావు, డిసిఎంఎస్ డైరెక్టర్ జల్లు బలరాం నాయుడు, మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షులు జి.రాంబాబు, స్థానిక నాయకులు కె.శంకరరావు, జి.సుధాకర్, మామిడి ఆదినారాయణ, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పరమేశ్వరరావు

ఉత్సవ విగ్రహాలుగా బిసి కార్పొరేషన్లు

డిసిసి అధ్యక్షులు పి.పరమేశ్వరరావు

ప్రజాశక్తి - టెక్కలి

రాష్ట్రంలో ఏర్పాటు చేసిన బిసి కార్పొరేషన్లకు నిధులు ఇవ్వకుండా, రాష్ట్ర ప్రభుత్వం వాటిని ఉత్సవ విగ్రహాలుగా మార్చిందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు పేడాడ పరమేశ్వరరావు విమర్శించారు. జాతీయ బిసి సంక్షేమ సంఘం ఈనెల 7, 8 తేదీల్లో జిల్లాలో నిర్వహించ తలపెట్టిన బిసి రథయాత్ర పోస్టర్‌ను నౌపడ ఆర్ఎస్ సమీపంలోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఏడు సామాజిక తరగతుల కార్పొరేషన్లకు ప్రాతినిధ్యం ఇచ్చిన ప్రభుత్వం, వాటికి నిధులు కేటాయించడం లేదన్నారు. కేవలం ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రోటోకాల్ ప్రకారం పాల్గొనే వంధిమాగదులుగా వారిని మార్చడం బిసిలను అవమానించడమేనని ధ్వజమెత్తారు. ఫలితంగా ఆ కార్పొరేషన్లతో జిల్లా ప్రజలకు ఎటువంటి మేలు చేకూరడం లేదని వాపోయారు. బిసి కార్పొరేషన్లకు నిధుల విడుదలపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బిసి కార్పొరేషన్లకు నిధులు మంజూరు చేసి వారిని ఆదుకోవాలని కోరారు. జాతీయ బిసి సంక్షేమ సంఘం తలపెట్టిన రథయాత్రకు కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతునిస్తుందని ప్రకటించారు. మహిళా రిజర్వేషన్ బిల్లులో ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీలకు రిజర్వేషన్లు లేకుండా పార్లమెంట్‌లో ప్రతిపాదించిన కేంద్ర ప్రభుత్వం, బిసిలపై తమ విధానమేంటో ఇప్పటికే స్పష్టం చేసిందన్నారు. దేశవ్యాప్తంగా బిసి జనగణన చేయాలని, చట్టసభల్లో సముచిత స్థానం కల్పించాలని జాతీయ బిసి సంక్షేమ సంఘం డిమాండ్లు ఫలప్రదం కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు పి.చంద్రపతిరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు కింతలి రాము, అమిరుల్లా బేగ్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానానికి ముందుకు రావాలి

జాయింట్ కలెక్టర్ నవీన్ పిలుపు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

అత్యవసర సమయాల్లో ప్రాణాలను కాపాడేందుకు రక్తం ఎంతో అవసరమని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ అన్నారు. రక్తదానానికి యువత, ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. శ్రీధర్మశాస్త్ర సన్నిధాన ట్రస్టు వైస్ చైర్మన్ పాలకొండ ప్రశాంత్ ఆధ్వర్యాన నగరంలోని యాక్సిస్ బ్యాంక్ మేడపై మెగా రక్తదాన శిబిరాన్ని మంగళవారం జెసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలన్నారు. జిల్లాలో రక్తం నిల్వల కొరత ఉందన్నారు. అవసరాలకు తగ్గట్లుగా రక్తనిల్వలు లేకపోవడంతో అత్యవసర సమయాల్లో ఎదురవుతున్న ఇబ్బందులను వివరించారు. రక్తదానంపై అపోహలు వీడాలన్నారు. అన్ని బ్లడ్‌బ్యాంకులను సమన్వయం చేసుకుని రక్తదాన శిబిరం ఏర్పాటు చేయాలన్న ప్రశాంత్ ఆలోచన అభినందనీయమన్నారు. ఆయన కూడా 25 సార్లు రక్తదానం చేసి ఇతరులకు ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. ప్రశాంత్ మాట్లాడుతూ అందరి సహకారంతో ఏటా స్వచ్ఛంద రక్తదాన శిబిరాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం రక్తదాతలకు మెమోంటో, ప్రశంసాపత్రాలను జెసి అందజేశారు. కార్యక్రమంలో జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షి, ఎఎస్‌పి టి.పి విఠలేశ్వర్, సెట్‌శ్రీ సిఇఒ బి.వి ప్రసాదరావు, రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు, లయన్స్ క్లబ్ అధ్యక్షులు నటుకుల మోహన్, ఎస్.జోగినాయుడు, గేదెల ఇందిరా ప్రసాద్, ఇతర స్వచ్ఛంద సేవాసంస్థల ప్రతినిధులు హారికా ప్రసాద్, రెడ్‌క్రాస్ ప్రతినిధులు పెంకి చైతన్య కుమార్, కె.సత్యనారాయణ, శ్రీధర్మశాస్త్ర సన్నిధానం ట్రస్టు చైర్మన్ బరాటం సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



రక్తదాతలకు ప్రశంసాపత్రాలను అందజేస్తున్న జెసి నవీన్

ఈ-వ్యర్థాలతో పర్యావరణానికి ముప్పు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఎలక్ట్రానిక్ వస్తువుల వినియోగం తర్వాత నిరర్ధకంగా మారుతున్న వ్యర్థాల వల్ల పర్యావరణానికి ముప్పు పొంచి ఉందని లయన్స్ క్లబ్ సెంట్రల్ అధ్యక్షులు పి.రవికుమార్ అన్నారు. నగరంలోని ఒక ప్రయివేటు హాల్‌లో క్లబ్ ఆధ్వర్యాన అంతర్జాతీయ ఈ-వేస్ట్ దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ పరికరాల వినియోగం పెరుగుతున్న కారణంగా, ఈ-వ్యర్థాలు పెద్దసంఖ్యలో పేరుకుపోతున్నాయని తెలిపారు. ఇ-వ్యర్థాల్లో భారీ లోహాలు, జ్వాల నిరోధకాలు, ఇతర విష పదార్థాల వల్ల ప్రమాదం పొంచి ఉందన్నారు. వీటి నిర్వహణలో లోపం వల్ల కొత్త కొత్త అనారోగ్య సమస్యలు ప్రజలను వెంటాడే అవకాశముందని చెప్పారు. మానవ ఆరోగ్యంతో పాటు పర్యావరణానికి తీవ్రమైన ప్రమాదం సంభవించనుందన్నారు. ఇటువంటి వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో పారవేయడం తగదన్నారు. వీటిని సేకరించి రీసైక్లింగ్ చేయడం చాలా కీలకమన్నారు. అనంతరం పర్యావరణ పరిరక్షణ పేరిట ముద్రించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో క్లబ్ కోశాధికారి శిల్లా మణికంఠ, సభ్యులు కామేష్, ఈవెంట్స్ ఆర్గనైజర్ సాయిబాబా, కాకినాడ ఆదిత్య కాలేజ్ విద్యార్థులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రవికుమార్

నేల సంరక్షణతోనే భూసారం



రణస్థలం : మాట్లాడుతున్న వ్యవసాయశాఖ జెడి శ్రీధర్

ప్రజాశక్తి - రణస్థలం

మనిషి ఉనికికి, జీవనానికి మూలాధారమైన నేలను సంరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకులు కె.శ్రీధర్ అన్నారు. రణస్థలం మండలం పైడిభీమవరంలో డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్-వ్యవసాయ శాఖ సంయుక్తంగా మంగళవారం నిర్వహించిన ప్రపంచ నేల దినోత్సవంలో ఆయన మాట్లాడారు. ఆరోగ్యవంతమైన నేల ఉన్నప్పుడే జీవకోటిని పోషించడానికి కావాల్సిన ఆహార ఉత్పత్తి సాధ్యమవుతుందన్నారు. వ్యవసాయ రంగంలో విచక్షణారహితమైన మానవ కార్యకలాపాల వల్ల నేలపై పొరలు నానాటికీ దెబ్బతింటున్నాయని తెలిపారు. దీనివల్ల ఆహార ఉత్పత్తి ప్రమాదంలో పడే అవకాశం ఉందని ఆత్మ ప్రాజెక్ట్ డైరెక్టర్ రామచంద్రరావు అన్నారు. రైతులు విచక్షణ రహితంగా ఎరువులు, పురుగుమందులు వాడకం తగ్గించాలని, సంప్రదాయ వ్యవసాయ పద్ధతులపై అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆమదాలవలస సహాయ సంచాలకులు సత్యవతి, కృషి విజ్ఞాన కేంద్రం సస్యరక్షణ శాస్త్రవేత్త అనూష, డాక్టర్ బాలకృష్ణ, రణస్థలం ఎడిఎ వి.శ్రీనివాసరావు, జిల్లా వనరుల కేంద్రం వై.సూర్యకుమారి, ఎఒ విజయభాస్కర్, రెడ్డీస్ ఫౌండేషన్ డిప్యూటీ మేనేజర్ ఆర్.హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్ : జీవుల మనుగడకు ప్రధాన అవసరాలైన నేల, నీటిని సంరక్షించుకోవాల్సిన అవసరం ఉందని, ఆ దిశగా ప్రజలను జాగృతం చేయాలని నైర వ్యవసాయ కళాశాల డీన్ డాక్టర్ డి.శ్రీనివాస్ అన్నారు. ప్రపంచ నేల దినోత్సవంలో ఆయన మాట్లాడుతూ వర్షపునీరు భూమిలోకి ఇంకకపోతే వరద ప్రవాహంగా మారుతుందని, వరదల వల్ల నేల కోతకు గురై బీడుగా మారుతుందన్నారు. దీనివల్ల ఉత్పాదక శక్తి, భూసారం కోల్పోవడం, ఆహారోత్పత్తి తగ్గుతుందన్నారు. రానున్న రోజుల్లో ఆహార భద్రత కొరవడుతుందన్నారు. దేశంలో 65 శాతం భూభాగం వర్షాధారంపైనే సాగవుతోందని, వర్షపునీటిని సద్వినియోగం ద్వారా పంటదిగుబడి పెంచవచ్చన్నారు. మృత్తికా విభాగం యూనివర్సిటీ అధిపతి డాక్టర్ పి.గురుమూర్తి మాట్లాడుతూ మిశ్రమ పంటల సాగును ప్రోత్సహించాలన్నారు. వ్యర్థాలను రీసైక్లింగ్ చేసి కంపోస్టు ఎరువుగా మార్చాలన్నారు. కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

ఆమదాలవలస : పంట పొలాల భూసారాన్ని కాపాడాలని మండల ఎఒ మెట్ట మోహనరావు అన్నారు. మంగళవారం మండలంలోని దూసి రైతుభరోసా కేంద్రంలో ప్రపంచ నేల దినోత్సవం సందర్భంగా రైతులకు భూసార పరీక్షలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సేంద్రియ ఎరువులను వాడటం వల్ల ఆశాజనకమైన పంటలతో పాటు భవిష్యత్ తరాలకు సరిపడే భూసారాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఎఇఒ రమణమూర్తి, అగ్రికల్చర్ అసిస్టెంట్ అలేఖ్య, రైతులు పాల్గొన్నారు.

బూర్జ : ప్రతి ఒక్కరు నేలను సంరక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆర్ట్స్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ నూక సన్యాసిరావు అన్నారు. నేల దినోత్సవం సందర్భంగా మండలంలోని పెద్దపేట గ్రామంలో ఆర్ట్స్ స్వచ్ఛంద సంస్థ కార్యాలయంలో కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.